సాక్షి ప్రకాశం

శుక్రవారం । 27 । అక్టోబర్ । 2023



పోలీసు అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

పోలీసు అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకమని ఎస్పీ మలికాగర్గ్ అన్నారు. ఒంగోలులో ఓపెన్ హౌస్‌ను ప్రారంభించారు. - 8లో..



వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు యువకులు మృతి

జాతీయ రహదారులపై జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువకులు మృత్యువాతపడ్డారు. - 8లో..

గరిష్టం/కనిష్టం 36/25

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగలు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నేడు త్రిపురాంతకంలో మండల స్థాయి స్పందన

ఒంగోలు అర్బన్: ప్రతి శుక్రవారం నిర్వహించే మండల స్థాయి స్పందన కార్యక్రమాన్ని నేడు త్రిపురాంతకంలో కలెక్టర్ దినేష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి. త్రిపురాంతకం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించనున్న స్పందన కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం హాజరవుతుందని, మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా వచ్చే నెల 3వ తేదీ కొనకనమిట్ల మండలంలో, 10వ తేదీ టంగుటూరు, 17వ తేదీ కంభం, 24వ తేదీ దొనకొండ మండలాల్లో స్పందన కార్యక్రమాలు జరుగుతాయని వెల్లడించారు.

రేపు అండర్-17 ఎస్‌జీఎఫ్ క్రికెట్ సెలక్షన్స్

ఒంగోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17 బాలబాలికల క్రికెట్ సెలక్షన్స్‌ను ఈ నెల 28వ తేదీ ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కె.వనజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బాపట్ల జిల్లా మార్టూరు మండలం వలపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సెలక్షన్స్ జరుగుతాయని, పూర్తి వివరాలకు 98485 61864, 96188 01191 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

రేపు వాల్మీకి జయంతి

ఒంగోలు: మహర్షి వాల్మీకి జయంతిని ఈ నెల 28న స్థానిక కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించనున్నట్లు వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి ఎం.మంజుల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లాలోని వాల్మీకి సంఘ నాయకులు, బీసీ సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అండర్-19 ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ సెలక్షన్స్ వాయిదా

ఒంగోలు: ఉమ్మడి జిల్లాలోని అన్ని యాజమాన్యాల కింద నిర్వహిస్తున్న జూనియర్ కాలేజీల్లో చదువుతున్న అండర్-19 క్రీడాకారులకు ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ సెలక్షన్స్ వాయిదా వేసినట్లు ఎస్‌జీఎఫ్ అండర్-19 జిల్లా కార్యదర్శి మసనం ఆదినారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందు నిర్ణయించిన ప్రకారం ఈ నెల 27న కందుకూరులోని టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో సెలక్షన్స్ నిర్వహించాలన్నారు. అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు చెప్పారు. మళ్లీ నిర్వహించే తేదీ, సమయం, వేదిక వివరాలను త్వరలో తెలియజేస్తామని, క్రీడాకారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

డ్రోన్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

ఒంగోలు: నిరుద్యోగ గ్రామీణ యువతకు డ్రోన్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఫీల్డ్ కోఆర్డినేటర్ హరిప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 19 నుంచి 28 సంవత్సరాల మధ్య వయసు గల 10వ తరగతి పాసై డిగ్రీ పాస్/ఫెయిల్, ఐటీఐ డిప్లమా పాస్/ఫెయిల్ అయిన యువత శిక్షణకు అర్హులని చెప్పారు. నాలుగు నెలలపాటు శిక్షణ ఉంటుందని, శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారని వివరించారు. వ్యక్తిత్వ వికాసం, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్‌లో కూడా శిక్షణ ఇవ్వడంతో పాటు భారత ప్రభుత్వ సర్టిఫికెట్ ఇప్పించనున్నట్లు తెలిపారు. అంతేగాకుండా వివిధ సంస్థల్లో డ్రోన్ సర్వీస్ టెక్నీషియన్లుగా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 30 నుంచి బ్యాచ్ ప్రారంభమవుతుందని, ఆసక్తి గలవారు కడపలోని డ్రోన్ సర్వీస్ టెక్నీషియన్ ట్రైనింగ్ సెంటర్ (90004 87423)ను సంప్రదించాలని సూచించారు.

పశుసంవర్ధకశాఖలో 28 మందికి పదోన్నతులు



పదోన్నతి పొందిన సిబ్బందితో జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి బేబీరాణి

ఒంగోలు సెంట్రల్: జిల్లా పశుసంవర్ధక శాఖలో పనిచేస్తున్న 28 మంది గ్రామ పశువైద్య సహాయకులు (ఏహెచ్ఏ)కు వెటర్నరీ అసిస్టెంట్లు (వీఏ)గా పదోన్నతి లభించింది. వారందరికీ జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి బేబీరాణి గురువారం పదోన్నతి పత్రాలు అందించారు. వృత్తిలో అంకితభావంతో పనిచేసి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని పిలుపునిచ్చారు.

సమస్యలపై సమరం..!

వివిధ రకాల స్పందన కార్యక్రమాల ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయిలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమానికి 2021 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 59,587 అర్జీలు అందగా, వాటిలో 97 శాతం పరిష్కారమయ్యాయి. దీంతో పాటు జగనన్నకు చెబుదాం పేరుతో నిర్వహించిన స్పందన కార్యక్రమాలకు 15,875 వినతులు వచ్చాయి. ఇంకా.. ఉద్యోగుల కోసం ప్రత్యేక స్పందన, నియోజకవర్గ, మండల స్థాయిల్లోనూ స్పందన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కలెక్టర్ దినేష్‌కుమార్ నేరుగా పర్యవేక్షిస్తూ అర్జీల పరిష్కారానికి కృషి చేస్తున్నారు.

- ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం
- పెద్ద ఎత్తున పలు రకాల స్పందన కార్యక్రమాలు
- ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో స్పందన
- 2021 నుంచి ఇప్పటి వరకు 59,587 అర్జీలు
- 97 శాతం పరిష్కారం
- ఉద్యోగుల కోసం ప్రత్యేక స్పందన నిర్వహణ
- జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 15,875 వినతులు
- నియోజకవర్గ, మండల స్థాయిల్లోనూ స్పందన కార్యక్రమాలు



కలెక్టరేట్లో స్పందన నిర్వహిస్తున్న కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ (ఫైల్)

ఒంగోలు అర్బన్: గత ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన సుదీర్ఘ పాదయాత్రలో ప్రజల సమస్యలను దగ్గరగా చూశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్ద పీట వేశారు. క్షేత్ర స్థాయిలోనే సమస్యలు పరిష్కరించాలనే లక్ష్యంతో 'స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా, అందుకు అధికార యంత్రాంగం బాధ్యత వహించేలా చర్యలు చేపట్టారు. అంతేగాకుండా అధికార యంత్రాంగమే ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు పరిష్కరించేలా పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఎప్పటికప్పుడు ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు.

మండల స్థాయిలోనూ కలెక్టర్ ఆధ్వర్యంలో స్పందన...

జిల్లాస్థాయిలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంతో పాటు మండల స్థాయిలోనూ కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా అధికార యంత్రాంగంతో ప్రతి శుక్రవారం స్పందన కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అంతేగాకుండా ప్రతి నెలా 3వ శుక్రవారం ఉద్యోగుల సమస్యలపై ఎంప్లాయీస్ గ్రీవెన్స్, జగనన్నకు చెబుదాం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తోంది. నియోజకవర్గ స్థాయిలోనూ కలెక్టర్ ప్రత్యేక స్పందన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో వచ్చిన అర్జీలను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని పరిష్కరిస్తున్నారు. మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారులను తీవ్రంగా హెచ్చరిస్తూ క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యలన్నీ పరిష్కారం కావాలని స్పష్టం చేస్తున్నారు.

స్పందన నిర్వహణలో కలెక్టరేట్‌కు ఐఎస్ఓ గుర్తింపు...

ప్రజల నుంచి సమస్యలపై ఒకసారి వచ్చిన అర్జీ మరోసారి ఏ స్థాయిలోనూ రీఓపెన్ కాకుండా ఉండేలా అధికారులకు ప్రత్యేక వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నారు. స్పందన నిర్వహించడంలో జిల్లా కలెక్టరేట్‌కు లభించిన ఐఎస్ఓ గుర్తింపు కలెక్టర్, అధికార యంత్రాంగం మెరుగైన పనితీరుకు నిదర్శనంగా నిలుస్తోంది.

నియోజకవర్గ స్థాయి స్పందనకు 1,837 అర్జీలు...

కలెక్టర్ దినేష్‌కుమార్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన ప్రత్యేక స్పందన కార్యక్రమాలకు మొత్తం 1,837 అర్జీలు అందాయి. జిల్లాలోని మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెం, దర్శి, కనిగిరి, కొండపి, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో ఆయా కార్యక్రమాలు నిర్వహించారు.

97 శాతం సమస్యలు పరిష్కారం...

రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేపట్టిన స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాల్లో జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 59,587 అర్జీలు అందాయి. వాటిలో 58,083 అర్జీలు (97 శాతం) పరిష్కారమయ్యాయి. మిగిలిన 1,504 అర్జీల పరిష్కారం దిశగా అధికారులు చర్యలు చేపట్టారు.

'జగనన్నకు చెబుదాం'లో 12,587 అర్జీల పరిష్కారం...

ఈ ఏడాది మే నెల నుంచి ప్రారంభమైన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా 15,875 అర్జీలు ప్రజల నుంచి అధికారులకు అందాయి. వాటిలో 12,587 అర్జీలు (87 శాతం) పరిష్కారం కాగా, 3,288 అర్జీలు పరిష్కారం కావాల్సి ఉంది.

మండల స్థాయి స్పందనలో 696...

ఈ ఏడాది సెప్టెంబర్ 1వ తేదీ జీవో నంబర్ 1775 ద్వారా మండల స్థాయిలోనూ కలెక్టర్, జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం ప్రత్యేక స్పందన కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. అప్పటి నుంచి జిల్లాలోని ఒంగోలు, గిద్దలూరు, మార్కాపురం, దర్శి, పొదిలి, రాచర్ల, శింగరాయకొండ, పామూరు మండలాల్లో స్పందన కార్యక్రమాలు నిర్వహించారు. వాటిలో ఇప్పటి వరకు మొత్తం 1,548 అర్జీలు అందగా, 696 అర్జీలు పరిష్కరించారు.

ఎంప్లాయీస్ గ్రీవెన్స్‌లో 87...

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రతి నెలా మూడో శుక్రవారం కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఎంప్లాయీస్ గ్రీవెన్స్ నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది జూలై నుంచి ప్రారంభమైన ఈ గ్రీవెన్స్‌లో ఇప్పటి వరకు 109 అర్జీలను ఉద్యోగులు అందజేశారు. వాటిలో 87 (80 శాతం) పరిష్కారమయ్యాయి.



గత శుక్రవారం ఉద్యోగులకు నిర్వహించిన ప్రత్యేక స్పందన కార్యక్రమంలో జేసీ కె.శ్రీనివాసులుకు సమస్యలు తెలియజేస్తున్న రెవెన్యూ ఉద్యోగుల సంఘ నాయకులు

సమస్యలు రీ ఓపెన్ కాకుండా చర్యలు



స్పందన కార్యక్రమాల్లో ప్రజలు, ఉద్యోగులు ఇచ్చే అర్జీల తాలూకా సమస్యలు రీ ఓపెన్ కాకుండా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నాం. నిరంతరం గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారులతో స్పందన సమస్యల పరిష్కారంపై సమీక్షిస్తూ దిశానిర్దేశం చేస్తున్నాం. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలకు ఉపక్రమిస్తాం. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్ద పీట వేస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం కూడా ఆ దిశగా ప్రత్యేక శ్రద్ధ వహించేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాం. అర్జీల పరిష్కారంలో సరాసరిన 90 శాతానికిపైగా మన జిల్లా ఉంది. మరిన్ని ఫలితాలు సాధించే దిశగా కృషి చేస్తున్నాం.

– ఏఎస్ దినేష్‌కుమార్, కలెక్టర్

ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేసి ఆయా శాఖలకు పంపిస్తున్నాం



స్పందన కార్యక్రమాల్లో వచ్చిన ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేసి సంబంధిత శాఖలకు పంపిస్తున్నాం. అర్జీదారులకు తగిన రసీదు ఇస్తున్నాం. స్పందన రోజుల్లోనే కాకుండా ఇతర రోజుల్లోనూ ఎవరైనా అర్జీలు తీసుకొస్తే స్వీకరించి ఆన్‌లైన్ చేస్తున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్ణీత సమయంలో అర్జీలు పరిష్కారమయ్యేలా ఆయా శాఖల అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేస్తూ అర్జీదారులకు జవాబుదారీగా ఉంటున్నాం.

– బి.నాగజ్యోతి, స్పందన సెల్ సూపరింటెండెంట్

రబీ సాగులో మెళకువలు పాటించాలి

- జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, పాల్గొన్న దర్శి కేవీకే శాస్త్రవేత్తలు

ఒంగోలు సెంట్రల్: రబీ పంటల సాగులో మెళకువలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు రైతులకు పిలుపునిచ్చారు. రబీ పంటల సాగులో రైతులు పాటించాల్సిన మెళకువలపై స్థానిక ప్రకాశం భవనంలోని స్పందన సమావేశపు మందిరంలో దర్శి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బందికి గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ మేలు రకమైన విత్తనాలు వాడి సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి పొందవచ్చని తెలిపారు. దర్శి కృషి విజ్ఞాన కేంద్రం వారి సలహాలు, సూచనలను రైతులకు తెలియజేసి మంచి దిగుబడులకు సహకరించాలని కోరారు. దర్శి కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ఎస్‌వీవీఎస్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ సరైన సమయంలో తగిన సస్యరక్షణ చర్యలకు కేవీకే శాస్త్రవేత్తలు సూచనలు చేస్తారని, అవి తప్పనిసరిగా రైతులకు చేరేలా చూడాలని వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బందిని కోరారు. దర్శి వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ప్రమీలరాణి మాట్లాడుతూ వివిధ పంటల్లో తక్కువ ఖర్చుతో కలుపు నివారణ చర్యలను సూచించారు.

మరో శాస్త్రవేత్త డాక్టర్ టి.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ రబీలో సాగు చేసే పంటలైన శనగ, మినుములో అనువైన కొత్త వంగడాల గురించి వివరించారు. కేవీకే కీటక శాస్త్రవేత్త ఎం.జాహ్నవి మాట్లాడుతూ రబీలో సాగు చేసే ప్రధాన పంటలు, ఆశించే ప్రధాన పురుగులు, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఒంగోలు ఏడీఏ బి.రమేష్‌బాబు మాట్లాడుతూ ఈ-పంట నమోదుకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలిపారు. శింగరాయకొండ ఏడీఏ నిర్మలకుమారి మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రం నుంచి నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సరఫరా అవుతున్నాయని, వాటితో పాటు రాయితీపై ఇచ్చే శనగల పంపిణీలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో 11 మంది వ్యవసాయాధికారులు, పది మంది ఏఈఓలు, 170 మంది ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ డాక్యుమెంట్ల నిందితులను అరెస్టు చేయాలి

- ఎస్పీ మలికాగర్గ్



సిట్ బృందంతో మాట్లాడుతున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: జిల్లా వ్యాప్తంగా నకిలీ డాక్యుమెంట్లు సృష్టించిన కేసుల్లో నిందితులను పక్కా సాక్ష్యాధారాలతో అరెస్టు చేయాలని ఎస్పీ మలికాగర్గ్ పోలీసు అధికారులను ఆదేశించారు. ఒంగోలులోని తాలూకా పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆమె సందర్శించారు. ఇప్పటి వరకు నమోదైన నకిలీ డాక్యుమెంట్లు, రబ్బర్ స్టాంపులు, ఫోర్జరీ సంబంధిత 19 కేసులపై ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందంతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా కేసుల్లో పురోగతి, ఇతర అంశాలపై ఆరా తీశారు. నకిలీ డాక్యుమెంట్లకు సంబంధించిన సీడీ ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీస్, రెవెన్యూ, రిజిస్ట్రార్ల సహకారం, సమన్వయంతో లోతుగా దర్యాప్తు చేయాలని సూచించారు. ఇళ్ల స్థలాలు, ప్లాట్లు, వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ పత్రాలు, డీకే, డెత్, ఈసీలను సంబంధిత శాఖల ద్వారా పరిశీలించి తద్వారా వాస్తవ యజమానులు, డాక్యుమెంట్లను గుర్తించాలని చెప్పారు. ప్రస్తుతం కేసులకు సంబంధించిన డాక్యుమెంట్ల పరిశీలన చేయడం జరుగుతోందని, పలు నకిలీ పత్రాలను సీజ్ చేశామని, ఇంకా లోతుగా దర్యాప్తు చేసి మిగిలిన నిందితులను కూడా అరెస్టు చేసి శిక్షలు పడేలా చేస్తున్నామని ఎస్పీ తెలిపారు. సమావేశంలో ఏఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఎస్పీ (క్రైం) ఎస్‌వీ శ్రీధర్‌రావు, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, డీఎస్పీలు వి.నారాయణ స్వామిరెడ్డి, అశోక్‌వర్ధన్, రామరాజు, సిట్ బృందంలోని సీఐలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు 24 మంది ఎంపిక



రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపికైన పాకల విద్యార్థులు

సింగరాయకొండ: రాష్ట్రస్థాయి జూడో పోటీలకు సింగరాయకొండ మండలంలోని పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 24 మంది విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం డీవీఎస్ ప్రసాద్ తెలిపారు. అండర్-14 విభాగంలో నలుగురు బాలురు, నలుగురు బాలికలు, అండర్-17 విభాగంలో ఇద్దరు బాలురు, ఐదుగురు బాలికలు, అండర్-19 విభాగంలో ముగ్గురు బాలురు, ఆరుగురు బాలికలు ఎంపికై నట్లు చెప్పారు. అండర్-14, 17 విభాగం ఎంపికలు పాకలలో, అండర్-19 విభాగం ఎంపికలు ఒంగోలులో జరిగాయన్నారు. ఎంపికైన వారు ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీ పి.హజరత్తయ్య తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై న విద్యార్థులను గురువారం ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

పక్కాగా ఎఫ్ఎల్‌సీ

- ఈవీఎం గోదామును పరిశీలించిన కలెక్టర్ దినేష్‌కుమార్



ఈవీఎం గోదామును పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: రాబోయే ఎన్నికల్లో వినియోగించేందుకు కొత్తగా వచ్చిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ఫస్ట్ లెవల్ చెకింగ్ (ఎఫ్ఎల్‌సీ) ప్రక్రియను పక్కాగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. ఒంగోలులోని మామిడిపాలెంలో ఈవీఎం గోదామును రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఎఫ్ఎల్‌సీ ప్రక్రియ పూర్తి చేసిన యంత్రాలను భద్రపరుస్తున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనల మేరకు ఎఫ్ఎల్‌సీ నిర్వహిస్తున్నామన్నారు. పటిష్టమైన భద్రతతో సీసీ కెమేరాల పర్యవేక్షణలో ఈ ప్రక్రియ జరుగుతోందన్నారు. లాగ్‌బుక్, రిజిస్టర్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ ప్రక్రియలో 12 బృందాలు పనిచేస్తున్నట్లు తెలిపారు. అదనంగా మరో రెండు బృందాల కోసం ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. నవంబర్ 10వ తేదీలోపు ఎఫ్ఎల్‌సీ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటి వరకు 30 శాతం ప్రక్రియ పూర్తయినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, డీఆర్ఓ శ్రీలత, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు శ్రీనివాసరావు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

18 ఏళ్లకే గుండెపోటుతో మృతి

- టీ తాగుతూ కుప్పకూలిన యువకుడు



మనోజ్ (ఫైల్)

ఒంగోలు టౌన్: అప్పటిదాకా స్నేహితులతో సరదాగా గడిపిన ఆ యువకుడు టీ తాగుదామని హోటల్ వద్దకు వెళ్లాడు. టీ తాగుతూ ఒక్కసారిగా కుప్పకూలిపోయి తిరిగిరాని లోకాలకు చేరుకున్నాడు. ఈ హఠాత్పరిణామానికి కుటుంబ సభ్యులు, స్నేహితులు షాక్‌కు గురయ్యారు. ఒంగోలు మండలంలోని యరజర్ల గ్రామానికి చెందిన చావల మహేష్, సుశీల దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు మనోజ్ వయసు 18 సంవత్సరాలు. ఒంగోలులోని ఓ ప్రైవేటు కాలేజీలో ఎంఎల్‌టీ చదువుతూ అంజయ్య రోడ్డులోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో టీ తాగుదామని స్నేహితులతో కలిసి సమీపంలోని టీస్టాల్ వద్దకు వెళ్లాడు. టీ తాగుతూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే వైద్యశాలకు తీసుకెళ్లగా గుండెపోటుతో మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. సీపీఆర్ చేసేందుకు ప్రయత్నించినా ప్రయోజనం లేకుండా పోయింది. ఇంత చిన్నవయసులో గుండెపోటుతో మరణించడం అందరినీ షాక్‌కు గురిచేసింది. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కన్నీరుమున్నీరవుతున్నారు. గురువారం సాయంత్రం యరజర్ల గ్రామంలోని శ్మశాన వాటికలో మనోజ్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

ఐఎస్ఓ నిబంధనలకు స్టాండింగ్ కమిటీ ఏర్పాటు

ఒంగోలు అర్బన్: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఐఎస్ఓ-9001 క్వాలిటీ సర్టిఫికేషన్ నియమ నిబంధనల అమలు కోసం కలెక్టర్ దినేష్ కుమార్ గురువారం స్టాండింగ్ కమిటీ ఏర్పాటు చేశారు. ప్రకాశం భవనంలో కమిటీతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. స్టాండింగ్ కమిటీతో పాటు ఆడిట్, డాక్యుమెంటేషన్, కీ పర్ఫామెన్స్ ఇండికేటర్స్, హ్యూమన్ రిసోర్స్, ఇంప్లిమెంటేషన్ కమిటీలు నియమించారు. కమిటీల వారీగా అధికారులకు బాధ్యతలు అప్పగించారు. కమిటీ చైర్మన్‌గా కలెక్టర్ ఉండగా వైస్ చైర్మన్‌గా జాయింట్ కలెక్టర్, మెంబర్ కన్వీనర్‌గా అసిస్టెంట్ కలెక్టర్, సభ్యులుగా డీఆర్ఓ, సీపీఓ, డీసీఓ, డీఈఓ, డీపీఓ, అగ్రికల్చర్ జేడీ, డిజేబుల్ ఏడీ, క్వాలిటీ కంట్రోల్ ఈఈ, డీఏఓ, డీఎంహెచ్ఓ, ఎక్సైజ్ సూపరింటెండెంట్‌లను నియమించారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

- సబ్ కలెక్టర్ సేతు మాధవన్



విచారణ చేస్తున్న సబ్ కలెక్టర్ సేతు మాధవన్

పుల్లలచెరువు: గ్రామాల్లో ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్ హెచ్చరించారు. గురువారం మండలంలోని చౌటపాచర్లలో వివాదంలో ఉన్న సర్వే నంబర్-1కి సంబంధించిన వివరాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూముల విషయంలో రెవెన్యూ అధికారులు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవరైనా ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు న్యాయం చేస్తామని చెప్పారు. అనంతరం ఉమ్మడివరంలో గతేడాది జరిగిన రైతు ఆత్మహత్యకు సంబంధించి విచారణ చేశారు. కుటుంబ సభ్యులను అడిగి వివరాలు సేకరించారు. ఆయన వెంట తహసీల్దార్ దాసు, సర్వేయర్ రాముల నాయక్, వీఆర్వోలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నవంబర్ 1న దరఖాస్తుల పరిశీలన

ఒంగోలు: ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ కోసం 2023 సెప్టెంబర్ 8వ తేదీ లోగా దరఖాస్తు చేసుకున్న ప్రకాశం జిల్లా అభ్యర్థుల దరఖాస్తుల పరిశీలన నవంబరు 1న నెల్లూరు జిల్లా కాకుటూరులోని ఏపీఎస్ఆర్‌టీసీ జోనల్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారి బి.సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ వెంట నిర్ణీత నమూనాలో రూపొందించిన రెజ్యూమ్, ఆన్‌లైన్‌లో అభ్యర్థి దరఖాస్తు చేసుకున్న అప్రెంటిస్ రిజిస్ట్రేషన్ నంబర్, పాస్‌పోర్టు సైజు ఫొటో, ఎస్ఎస్‌సీ మార్కుల జాబితా, ఐటీఐ మార్కుల జాబితా, నేషనల్ ట్రేడ్ సర్టిఫికెట్, ఎస్సీ/ఎస్టీ/బీసీ అభ్యర్థులు శాశ్వత కులధృవీకరణ పత్రం, వైకల్యం కలిగిన వారు వైకల్యాన్ని నిరూపించే పత్రం, మాజీ సైనికులు సంబంధిత ధృవీకరణ పత్రం, ఎన్‌సిసి/ స్పోర్ట్స్ సర్టిఫికెట్లు కలిగిన వారు సంబంధిత ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డు పత్రాలను ఒరిజినల్‌తోపాటు ఒక సెట్ నకలు పత్రాలను కూడా వెంట తీసుకురావాలన్నారు. ఒరిజినల్ పత్రాలు, నకలు పత్రాలు తీసుకురాని వారిని ఇంటర్వ్యూకు అనుమతించమన్నారు. దరఖాస్తుల పరిశీలన సమయంలో తప్పనిసరిగా రూ.118 దరఖాస్తుల పరిశీలన రుసుం చెల్లించి రశీదు పొందాలన్నారు. పూర్తి వివరాలకు 9949810012, 9154291408 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం


పోలీసు ఓపెన్‌హౌస్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ మలికా గర్గ్


పోలీసు శాఖ వివరాలను విద్యార్థులకు తెలియజేస్తున్న ఎస్పీ

- ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: పోలీసు అమరవీరుల త్యాగాలు స్మరించుకుంటూ మరింత నిబద్ధతతో విధులకు అంకితం అవ్వాలని ఎస్పీ మలికాగర్గ్ అన్నారు. పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ నిర్వహించే స్మారకోత్సవాలలో భాగంగా గురువారం పోలీసు కల్యాణ మండపంలోని ఓపెన్ హౌస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు అమరుల త్యాగాలను జ్ఞప్తి చేసుకోవడంతో పాటుగా సమాజంలో పోలీసులు నిర్వర్తిస్తున్న పాత్ర గురించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏటా పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది దేశ వ్యాప్తంగా పోలీసులు విధినిర్వహణలో 188 మంది ప్రాణాలర్పించారని, ప్రకాశం జిల్లాలో ఇప్పటి వరకు 7 గురు పోలీసులు అమరులయ్యారని వివరించారు. ఈ ఏడాది పవన్‌కుమార్ అనే కానిస్టేబుల్ పాముకాటుకు గురై మరణించడం బాధకు గురిచేసిందన్నారు. వారోత్సవాల్లో భాగంగా రక్తదానం, మెడికల్ క్యాంపులు, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓపెన్ హౌస్‌లో పాల్గొన్న విద్యార్థులకు ఇక్కడ తిలకించిన అంశాలు, పోలీసు శాఖపై 25 ప్రశ్నలతో ఒక పరీక్ష నిర్వహించి అత్యధిక మార్కులు సాధించిన వారికి బహుమతి ప్రదానం చేస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఓపెన్ హౌస్ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని చెప్పారు.

ఓపెన్ హౌస్‌లో విద్యార్థులతో....

ఓపెన్ హౌస్ ప్రదర్శనలో భాగంగా ఎస్పీ మలికా గర్గ్ విద్యార్థులతో మమేకమయ్యారు. జిల్లా భౌగోళిక మ్యాప్ గురించి, దిశ యాప్, డయల్ 112, పోలీసు కంట్రోలు రూంలో ముఖ్య విధుల గురించి విద్యార్థులకు వివరించారు. పోలీసు యూనిఫాం ర్యాంక్స్, ట్రాఫిక్‌రూల్స్, వాటికి సంబంధించిన చిహ్నాలు, ఎన్‌డీపీఎస్, గ్యాంబ్లింగ్, పోక్సో, ర్యాగింగ్ యాక్ట్‌ల గురించి అవగాహన కల్పించారు. గుడ్‌టచ్ బ్యాడ్ టచ్‌కు సంబందించిన ఫ్లెక్సీలు, పోలీసులు రోజువారి విధుల్లో ఉపయోగించే పరికరాలు, బాంబ్ డిస్పోజల్ పరికరాలు, బాంబ్ బ్లాంకెట్, ట్రాఫిక్ పరికరాలు, కమ్యూనికేషన్ మ్యాన్ ప్యాక్ సెట్లు, నేర పరిశోధనలో ఉపయోగించే పోలీసు డాగ్ స్క్వాడ్ బృందాల గురించి విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, డీఎస్‌బీ డీఎస్పీ బి.మరియదాసు, ఒంగోలు డీఎస్పీ వి.నారాయణస్వామి రెడ్డి, తాలుకా సీఐ భక్తవత్సలరెడ్డి, ఎస్సీ ఎస్టీ సెల్ సీఐ కె.అజయ్‌కుమార్, ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, హరిబాబు పాల్గొన్నారు.

అందరి సహకారంతో ఆరోగ్యంగా..

- డిశ్చార్జి అయిన పాప శ్రావ్య

సాక్షి ఎఫెక్ట్..

ఉలవపాడు: మండల పరిధిలోని కరేడు పల్లెపాలెంకు చెందిన ఏడాది పాప మాకా శ్రావ్య నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతూ వైద్యం చేయించుకోలేని పరిస్థితో ఉన్న సమయంలో సాక్షిలో చిన్న పాపకు పెద్దకష్టం పేరుతో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి దాతలు భారీగా స్పందించారు. ఫోన్‌పే ద్వారా నేరుగా తండ్రి సురేష్‌కు నగదు అందించారు. సుమారుగా రూ.6.50 లక్షల వరకు దాతలు వైద్యానికి సాయం అందించారు. పిల్లల వైద్యనిపుణులు సతీష్‌బాబు ప్రధానంగా ఈ ఫండింగ్ బాధ్యతలు తీసుకున్నారు. సాయి స్కూల్ యాజమాన్యం రూ.60 వేలు అందించింది. ప్రకాశం, నెల్లూరు జిల్లాల ఫార్మసిస్టులు దాదాపు రూ.50 వేలు సాయం చేశారు. అంతే కాకుండా దాదాపు 400 మంది దాతలు ఫోన్ పేద్వారా సాయం అందించారు. వీరందరి సహకారంతో పాప శ్రావ్య గురువారం డిశ్చార్జి అయింది. వైద్యం కష్టం అయిన తరుణంలో తమను ఆదుకున్న సాక్షి పత్రిక, దాతలకు తండ్రి సురేష్ తల్లి భవాని కృతజ్ఞతలు తెలియచేశారు. ప్రస్తుతం పాప ఆరోగ్యంగా ఉందని తెలియచేశారు.


ఇంటి వద్ద ఆరోగ్యంగా ఉన్న పాప శ్రావ్య

సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే మద్దిశెట్టి

దర్శి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని దర్శి ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సోదరుడు గణేష్ వివాహ రిసెప్షన్‌కు హాజరైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను అదే కార్యక్రమానికి హాజరైన దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి భేటీ అయ్యారు.


సీఎం వైఎస్ జగన్‌తో ఎమ్మెల్యే వేణుగోపాల్

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు యువకులు మృతి

త్రిపురాంతకం/సింగరాయకొండ: జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో జాతీయ రహదారులపై చోటుచేసుకున్న ప్రమాదాల్లో ఇద్దరు యువకులు మృత్యువాతపడ్డారు. త్రిపురాంతకం మండలం రాజుపాలెం వద్ద జాతీయ రహదారిపై బైక్‌ను కారు ఢీకొనడంతో అదే గ్రామానికి చెందిన కె.బాలనాసరు(25) తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి త్రిపురాంతకం పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బాలనాసరు విజయవాడలో కూలీ పనులు చేసుకుని జీవిస్తున్నాడు. దసరా పండగ సందర్భంగా స్వగ్రామం వచ్చాడు. వ్యక్తిగత పని మీద బైక్‌పై త్రిపురాంతకం వెళ్తుండగా మార్కాపురం వైపు వస్తున్న కారు ఢీకొట్టింది. బాలనాసరు మృతితో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.


మృతి చెందిన ఉదయకుమార్

సింగరాయకొండ మండలంలో..

రెండు బైకులు ఢీకొన్న ఘటనలో పారాబత్తిన ఉదయకుమార్(22) అనే యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. బింగినపల్లికి చెందిన పారాబత్తిన ఉదయకుమార్ బుధవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో బింగినపల్లి నుంచి సింగరాయకొండకు బైక్‌పై వస్తున్నాడు. అదే సమయంలో సోమరాజుపల్లికి చెందిన బోడ్డు రవీంద్ర బైక్‌పై ఎదురుగా వస్తుండగా జగనన్న కాలనీ సమీపంలో రెండు బైకులు ఢీకొన్నాయి. తీవ్రంగా గాయపడిన ఉదయకుమార్‌ను చికిత్స నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. రవీంద్ర అనే యువకుడు ఒంగోలు కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.శ్రీరామ్ తెలిపారు.

కరణం వెంకటేష్‌కు ఎమ్మెల్యే అన్నా పరామర్శ


కరణం వెంకటేష్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అన్నా

కంభం: రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్లో చికిత్స పొందుతున్న చీరాల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌ను గురువారం గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు, ఆయన కుమారుడు అన్నా కృష్ణచైతన్య పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్యే అన్నా ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెంటం కంభం మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ నెమలిదిన్నె చెన్నారెడ్డి ఉన్నారు.

బొల్లుపల్లి సమీపంలో పులి సంచారం

- పాదముద్రలు గుర్తించిన అటవీశాఖ అధికారులు


బొల్లుపల్లి సమీపంలో పులి పాదముద్రలను పరిశీలిస్తున్న ఫారెస్టు అధికారులు

అర్ధవీడు(కంభం): అర్ధవీడు మండలంలో మరోసారి పులి సంచారం కలకలం రేపింది. బొల్లుపల్లి గ్రామ పంటపొలాల సమీపంలో పులి సంచరిస్తోందన్న ప్రచారం నేపథ్యంలో ఫారెస్టు అధికారులు అప్రమత్తమయ్యారు. బుధవారం వెలగలపాయ నాయిని చెరువు పరిసరాల్లో ఫారెస్టు అధికారులకు గతంలో పులి తిరిగిన పాదముద్రలు మాత్రమే కనిపించాయి. గురువారం తురిమెళ్ల రేంజ్ ఆఫీసర్ ప్రియాంక, వెలగలపాయ సెక్షన్ ఆఫీసర్ మంగ్యానాయక్, బొల్లుపల్లి బీట్ ఆఫీసర్ గఫార్ తమ సిబ్బందితో కలిసి మరోమారు వెలగలపాయ రస్తా నుంచి రంగాపురం జామాయిల్ తోట వరకు ఉన్న అడవి చుట్టూ గస్తీ నిర్వహించగా వారికి పులి అడుగుజాడలు కనిపించాయి. పులిసంచరిస్తున్నట్లు అనుమానంగా ఉన్న ప్రదేశాల్లో ట్రాప్ కెమెరాలు అమర్చామని ప్రజలెవరూ భయపడాల్సిన పనిలేదని చెప్పారు. ఫారెస్టు సిబ్బంది రాత్రి వేళల్లో సైతం గస్తీ తిరుగుతారని భరోసా ఇచ్చారు.

కనిగిరిలో రెండు హోటళ్లలో చోరీ


సీసీ ఫుటేజీలో దొంగ


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

కనిగిరి రూరల్: పట్టణంలోని పామూరు బస్టాండ్‌లో ఉన్న రెండు హోటళ్లలో బుధవారం అర్ధరాత్రి చోరీ జరగగా గురువారం వెలుగుచూసింది. హోటళ్ల నిర్వాహకులు, పోలీసుల కథనం మేరకు.. పట్టణానికి చెందిన ఎస్‌కే ఖాజారసూల్ పామూరు బస్టాండ్ వద్ద నక్షత్ర, మినర్వ హోటళ్లు నిర్వహిస్తున్నాడు. ఈ రెండు హోటళ్లు పక్కపక్కనే ఉంటాయి. రోజులాగే ఖాజారసూల్ గురువారం ఉదయాన్నే హోటల్‌కు చేరుకుని షట్టర్ తెరిచాడు. లోపలి దృశ్యాలను చూసి దొంగతనం జరిగినట్లు గ్రహించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వెనుక వైపు నుంచి హోటల్ లోపలికి ప్రవేశించిన దొంగ ముందుగా సీసీ కెమెరాలను తొలగించినట్లు పోలీసులు గుర్తించారు. నక్షత్ర హోటల్ లోపల దొంగ సుమారు అరగంట సేపు ఉండి కౌంటర్ టేబుల్ తాళాలు తెరిచి రూ.1.30 లక్షలు, మినర్వ హోటల్లో రూ.15 వేలు అపహరించాడు. క్లూస్ టీమ్ ఇన్‌చార్జి ఎస్సై మాధవరావు ఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు.

సీసీ కెమెరాల్లో చిక్కిన దొంగ

చోరీకి పాల్పడింది సుమారు 25 ఏళ్ల లోపు యువకుడని హోటల్ సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు గుర్తించారు. లభించిన ఆధారాల ప్రకారం దర్యాప్తును వేగవంతం చేశామని పోలీసులు తెలిపారు.

దగ్గు మందులో రబ్బర్ బ్యాండ్!

- తయారీదారు, మెడికల్ షాపు యజమానికి జరిమానా
- తీర్పు వెల్లడించిన వినియోగదారుల కమిషన్

ఒంగోలు: నిర్లక్ష్యానికి మూల్యం తప్పదని గురువారం ఒంగోలు వినియోగదారుల కమిషన్ ఇచ్చిన తీర్పు స్పష్టం చేసింది. 2019వ సంవత్సరంలో దర్శి పట్టణానికి చెందిన చిమట శ్రీను అనే వ్యక్తి ఒంగోలులోని మేఘనా మెడికల్స్‌లో దగ్గుకు గ్రిలింట్కస్ బీఎం దగ్గు మందు కొనుగోలు చేశాడు. ఇంటికి వెళ్లిన తర్వాత దగ్గు మందు సీసాలో రబ్బర్ బ్యాండు ఉన్నట్లు గుర్తించాడు. బాటిల్‌ను ఓపెన్ చేయకుండా ఒంగోలు చేరుకుని దుకాణదారును ప్రశ్నించగా వారు తమకు సంబంధం లేదని స్పష్టం చేశారు. దీంతో చిమట శ్రీను ఒంగోలు వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇరుపక్షాల వాదనలు, సాక్ష్యాధారాలను పరిశీలించిన కమిషన్ సభ్యులు విక్రయదారుతోపాటు తయారీదారుకు రూ.5 వేలు జరిమానా విధించారు. కోర్టు ఖర్చుల నిమిత్తం ఫిర్యాదుదారుకు రూ.3 వేలను 45 రోజుల్లోగా చెల్లించాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు దుగ్గంపూడి శ్రీదేవి, సభ్యులు వై.సుందరరావు, డాక్టర్ ఎస్‌ఏ సమీరా ఆదేశించారు.

తప్పిపోయిన చిన్నారి.. తల్లిదండ్రుల చెంతకు..


చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్సై

పొదిలి: పట్టణంలోని ఓ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న చిన్నారి గురువారం తప్పిపోయి దర్శి రోడ్డులో ఏడుస్తూ యువకుల కంట పడింది. ప్రసన్న అనే యువకుడు చిన్నారిని పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఎస్సై వెంకట సైదులు సదరు చిన్నారి వివరాలు తెలుసుకుని తల్లిదండ్రులు ఇట్లా పద్మ, ఏసుబాబును స్టేషన్‌కు పిలిపించారు. అప్పటికే కుమార్తె ఆచూకీ కోసం సుమారు ఐదు గంటలపాటు వెతికిన తల్లిదండ్రులు.. పాప సురక్షితంగా ఉందని తెలిసి ఊపిరిపీల్చుకున్నారు. కుమార్తెను సురక్షితంగా అప్పగించిన ప్రసన్న, ఎస్సై వెంకట సైదులుకు కృతజ్ఞతలు తెలిపారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య


లక్ష్మీనారాయణ(ఫైల్)

పీసీపల్లి: పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని వాకంవారిపల్లికి చెందిన పోకూరి లక్ష్మీనారాయణ(34) గురువారం మర్రికుంటపల్లి సమీపంలోని పొలాల్లో పురుగుమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించారు. స్థానికులు గమనించి కనిగిరి ఆస్పత్రికి తరలించి అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలుకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియలేదు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తపై టీడీపీ వర్గీయుల దాడి

- టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరడమే కారణం

మర్రిపూడి:

వైఎస్సార్ సీపీ కార్యకర్తపై టీడీపీ వర్గీయులు దాడికి పాల్పడిన సంఘటన మర్రిపూడి మండలంలోని జువ్విగుంట గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. జువ్విగుంట గ్రామంలో గురువారం భూసర్వే చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్త పసుపులేటి వెంకటస్వామితో భూసర్వే జరుగుతున్న ప్రదేశంలో గట్టు విషయమై టీడీపీ సానుభూతిపరులు గొడవకు దిగారు. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు మర్రిపూడి బయలుదేరిన పసుపులేటి వెంటస్వామిపై పథకం ప్రకారం కర్రలతో టీడీపీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. గత సర్పంచ్ ఎన్నికల సమయంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న అభిమానంతో స్థానిక నాయకుల సహకారంతో వైఎస్సార్ సీపీ చేరిన నాలుగు కుటుంబాలపై టీడీపీ వర్గీయులు గుర్రుగా ఉన్నారు.

అది మనసులో పెట్టుకుని దాడి చేశారని బాధితుడు తెలిపారు. పొదిలి ప్రభుత్వ వైద్యశాలలో బాధితుడు చికిత్స పొందుతున్నాడు. వైద్యశాల నుంచి వచ్చిన నివేదిక ప్రకారం కేసు నమోదు చేస్తామని ఎస్సై శివ బసవరాజు తెలిపారు.

తల్లి మందలించిందని బాలిక ఆత్మహత్య

ఉలవపాడు: తల్లి మందలించిందన్న కోపంతో బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉలవపాడులో జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఉలవపాడుకు చెందిన చిరుతోటి కిషోర్ స్వగ్రామం భీమవరం కాగా ఉలవపాడులో పదేళ్ల నుంచి నివాసం ఉంటున్నాడు. కిషోర్ రెండో కుమార్తె కుమార్తె నిఖిలశ్రీ(14) ఉలవపాడు ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో 8వ తరగతి చదువుతుంది. ఈ క్రమంలో దసరా సెలవుల్లో ఎక్కువగా బయట ఇళ్ల వద్ద ఉంటున్నావని తల్లి మందలించింది. దీంతో మనస్తాపం చెందిన బాలిక తండ్రి మింగే టాబ్లెట్లను 10 ఒక్కసారిగా మింగింది. దీంతో అస్వస్థతకు గురి కావడంతో 24వ తేదీ ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్ వైద్యశాలకు తీసుకువెళ్లి వైద్యం చేస్తుండగా గురువారం మృతి చెందింది. తండ్రి కిషోర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయస్థాయి పోటీల్లో సత్తా


అఖిలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గుడ్లూరు: జాతీయస్థాయి బాల్ బాడ్మింటన్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరుపున పాల్గొని గ్రూపు, మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో మండలంలోని చేవూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన టి.అఖిల అద్భుత ప్రతిభ చూపి పతకాలు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, పీఈటీ శివరావమ్మ తెలిపారు. ఛత్తీస్‌ఘడ్‌లోని భిలాయ్‌లో ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు జరిగిన జాతీయస్థాయి బాల్ బాడ్మింటన్ పోటీల్లో అఖిల పాల్గొనగా ఆంధ్ర జట్టు ద్వితీయస్థానం సాధించింది. అలాగే మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో అఖిల తమిళనాడు విద్యార్థితో కలిసి పాల్గొని మొదటి స్థానం సాధించినట్లు శ్రీనివాసులు తెలిపారు.

రెండు పతకాలు సాధించిన అఖిలను, శిక్షణ ఇచ్చిన పీఈటీ శివరావమ్మలను ప్రధానోపాధ్యాయుడితో పాటు ఉపాధ్యాయులు, యోగా టీచర్, గ్రామస్తులు అభినందించారు.